సాక్షి నిజామాబాద్

బుధవారం ၊ 30 ၊ ఆగస్టు ၊ 2023



మంత్రి ఆదేశాలు బేఖాతర్

స్కీం బాధితులకు తిరిగి డబ్బులు ఇచ్చేయాలని మంత్రి ఆదేశించినా నిర్వాహకులు పెడచెవిన పెడుతున్నారు.

- 8లో ▸



అందని మధ్యాహ్న బిల్లులు

మధ్యాహ్న భోజన బిల్లులు అందక ఏజెన్సీ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేస్తూ భోజనం పెడుతున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.7 /23.9

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం పాక్షికంగా మేఘావృతమయ్యే అవకాశం ఉంది. సాయంత్రం చిరుజల్లులు కురియవచ్చు.

న్యూస్‌రీల్

జాతీయ హాకీ పోటీలకు రాణి



కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలంలోని హాసాకొత్తూరు ఉన్నత పాఠశాలలో హిందీ భాష ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న పి రాణి జాతీయస్థాయి హాకీ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ క్రీడా పోటీల్లో హాకీ విభాగంలో టీచర్ రాణి పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. నవంబర్‌లో ఒరిస్సాలో జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున రాణి పాల్గొననున్నారు. మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణ కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



డొంకేశ్వర్(ఆర్మూర్) : ఉపాధిహామీ పథకంలో గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్సీ కవితను కలిసి వినతిపత్రం అందజేశారు. పెరిగిన నిత్యవసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు రావడం లేదని, కుటుంబ పోషణకు సరిపోవడం లేదన్నారు. నెలసరి వేతనం రూ.21,000 పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, గంగాధర్, గోపిచంద్, సునీత, పద్మ, తదితరులున్నారు.

భారత మాత ముద్దుబిడ్డ ధ్యాన్‌చంద్



నిజామాబాద్‌నాగారం : ధ్యాన్‌చంద్ హాకీ క్రీడల్లో అద్వితీయ ప్రతిభ చూపి దేశానికే పేరు తెచ్చారని, భారతమాత ముద్దుబిడ్డ అని జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్‌రావు పేర్కొన్నారు. మంగళవారం హాకీ మాంత్రికుడు, భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర, జిల్లా యువజన, క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నాగారంలో ఉదయం పలు క్రీడలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. నుడా చైర్మన్ ఈగ సంజీవ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారుల కోసం మైదానాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్, స్థానిక కార్పొరేటర్ వెల్డింగ్ నారాయణ, జిల్లా క్రీడాధికారి ముత్తన్న, హాకీ అసోసియేషన్ కార్యదర్శి రమణ, కోశాధికారి సురేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాఖీ పండుగ సందర్భంగా మహిళా ప్రయాణికులకు గిఫ్ట్‌లు

ఖలీల్‌వాడి : రాఖీ పౌర్ణమి పండగ సందర్భంగా ఈనెల 30, 31న ఉమ్మడి నిజామాబాద్‌లో బస్సుల్లో ప్రయాణించే మహిళలకు బహుమతులు ఇవ్వనున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్, బాన్సువాడ, బోధన్, కామారెడ్డి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బాక్స్‌లలో మహిళలు తమ టిక్కెట్లను వేయాలన్నారు. టిక్కెట్ల వెనక తమ పేరు, ఫోన్ నంబర్, ఊరి పేరు రాసి బాక్స్‌లో వేయాలని, రాఖీ పౌర్ణమి తర్వాత లక్కీడ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని మహిళా ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మానవతాసదన్ సందర్శన



డిచ్‌పల్లి : మండలకేంద్రంలోని మానవతాసదన్‌ను మంగళవారం నిజామాబాద్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సంపూర్ణ సందర్శించారు. సదన్ పిల్లలతో కలిసి మాట్లాడారు. సదన్ పిల్లలకు సమకూరుస్తున్న సదుపాయాలను కేర్ టేకర్ రమేశ్ వారికి వివరించారు. రెగ్యులర్‌గా పిల్లలకు చేయించే ఆరోగ్య పరీక్షల వివరాలు తెలిపారు. ఆమెవెంట చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు శోభ, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

హస్తవాసి ఎవరికో..!

- జిల్లా నుంచి టికెట్లను ఆశిస్తూ 53 దరఖాస్తులు
- బాన్సువాడ నుంచి 16 మంది..
- బోధన్ నుంచి ఇద్దరే..
- జాబితా విడుదల చేసిన టీపీసీసీ ఎలక్షన్ కమిటీ

కాంగ్రెస్ పార్టీ నుంచి శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులు పోటీ పడ్డారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఈనెల 25వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరించిన పార్టీ.. ఆశావహుల జాబితాను మంగళవారం విడుదల చేసింది.



నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్, నరాల రత్నాకర్, ఈరవత్రి అనిల్, తాహెర్‌బిన్‌హందాన్, కేశవ వేణు, ధర్మపురి సంజయ్, డాక్టర్ శివప్రసాద్, గడ్డం భక్త

అర్బన్ నుంచి..

వత్సలం(ఢిల్లీ), నరాల కల్యాణ్(ఎన్‌ఆర్‌ఐ), రామర్తి గోపి, కులాచారి (అర్సపల్లి) వెంకటేశ్వర్ రావు, సయ్యద్ నజీబ్ అలీ ఉన్నారు.

బోధన్ నుంచి..

మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి.

ఖలీల్‌వాడి : వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున జిల్లా నుంచి పోటీ చేసేందుకు ఆశావహులు పోటీపడ్డారు. దీంతో టీపీసీసీ ఎలక్షన్ కమిటీకి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈనెల 18 నుంచి 25 వరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు తీసుకున్నారు. జిల్లాలోని ఆరు నియోకవర్గాల నుంచి 63 దరఖాస్తులు వచ్చినట్లు పీసీసీ ఎన్నికల కమిటీ పేర్కొంది. మంగళవారం జాబితాను విడుద ల చేసింది. బాన్సువాడ నుంచి 16 మంది, నిజామాబాద్ అర్బన్ నుంచి 12 మంది అత్యధికంగా దరఖాస్తు చేసుకోగా బోధన్ నుంచి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి మాత్రమే దరఖాస్తు చేశారు.

రెండు నియోజకవర్గాల నుంచి..

బాన్సువాడ నియోజకవర్గంలో కొన్ని మండలాలు నిజామాబాద్‌లో ఉండగా మరి కొన్ని మండలాలు కామారెడ్డి జిల్లాలో ఉన్నాయి. ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్‌కు చెందిన 16 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో నాయకులతో పాటు డాక్టర్లు, వ్యాపారులు ఉన్నారు. నిజామాబాద్ అర్బన్ నుంచి 12 మంది పోటీ చేస్తున్నారు.

బీసీ స్థానాల కేటాయింపుపై చర్చ..

జిల్లాలోని బీసీ స్థానాలు కేటాయింపుపై కాంగ్రెస్ పార్టీలో చర్చ నడుస్తోంది. ఇటీవల జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో బీసీ డిక్లరేషన్‌పై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వక్తలు మాజీ ఎంపీలు హన్మంత్ రావు, మధుయాష్కీగౌడ్‌తో పాటు మాజీ విప్ ఈరవత్రి అనిల్ పార్లమెంట్‌లో రెండు నుంచి మూడు స్థానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిజామాబాద్ రూరల్ నుంచి..

మాజీ ఎమ్మెల్సీ డా రేకులపల్లి భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, డాక్టర్ కేతావత్ మోతీలాల్, కాటిపల్లి నగేష్‌రెడ్డి, మోతుకూరి చంద్రశేఖర్‌గౌడ్ (బాడ్సి శేఖర్ గౌడ్), నల్ల సుధాకర్ రెడ్డి, బేల్దారి గోవర్ధన్ దరఖాస్తులు చేసుకున్నారు.

బాల్కొండ నుంచి..

సుంకెట అన్వేష్‌రెడ్డి, ముత్యాల సునీల్, తిప్పిరెడ్డి మోహన్‌రెడ్డి (డీసీసీ అధ్యక్షుడు), బాస వేణు గోపాల్ యాదవ్, ప్రేమలత అగర్వాల్, క్యాతం గంగారెడ్డిలు దరఖాస్తులు చేసుకున్నారు.

బాన్సువాడ నుంచి..

కాసుల బాలరాజు, మాసాని అనిల్‌కుమార్‌రెడ్డి, కొడాలి సురేశ్, శ్రీనివాస్‌గౌడ్, కేతావత్ మోతీలాల్, పుప్పాల శంకర్, రెడ్డిగారి జ్యోతిర్మయిరెడ్డి, యలమంచిలి శ్రీనివాస్‌రావు, రమావత్ అంబర్‌సింగ్, ఇందూర్ చంద్రశేఖర్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, బొప్పిడి వెంకట్రాంరెడ్డి, ముత్తారెడ్డి రాజారెడ్డి, కె.అజయ్‌కుమార్, కొత్త సోమశేఖర్‌రావు, మెగావత్ ప్రతాప్‌సింగ్ దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలో ఎవరికి కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కుతుందో అంతర్గతంగా చేసిన సర్వే వల్ల స్పష్టమయ్యే అవకాశముంది. దీంతో ఆశావహులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.

ఆర్మూర్ నుంచి..

అశోక్‌గౌడ్, ఏబీ శ్రీనివాస్(చిన్నా), మార చంద్రమోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాధిక సురేందర్ రెడ్డి, తలారి పోశన్న, పొద్దుటూరి వినయ్‌రెడ్డి, కోల వెంకటేష్, యాల్లసాయరెడ్డి, గోర్తె(అర్గుల్) రాజేందర్ దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీకి రాజీనామా చేసి వినయ్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సెప్టెంబర్ 9న ఆర్మూర్‌లో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. అలాగే మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోర్తె రాజేందర్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో చేవెళ్లలో పార్టీలో చేరారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం



కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

- కేంద్ర నిధులతో పనులు చేస్తే బోర్డులు పెట్టాలి
- ప్రజోపయోగ పనులు సకాలంలో పూర్తవ్వాలి
- దిశ సమావేశంలో ఎంపీ ధర్మపురి అర్వింద్

సుభాష్‌నగర్ : రాష్ట్రంలోని మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లు, విద్యాభివృద్ధికి అవసరమైన నిధులను 75 శాతం వరకు కేంద్రం కేటాయిస్తుందని, మోదీ ప్రభుత్వానికి అన్నివర్గాల సంక్షేమమే ముఖ్యమని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. హిందూ, ముస్లింలు అంటూ బేధమేమీ కేంద్రానికి లేదని, కేవలం దుష్ప్రచారమేనన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై ఎజెండా అంశాల వారీగా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి వద్ద అప్రోచ్ రోడ్ నిర్మాణంతోపాటు వివిధ ఆర్వోబీ నిర్మాణ పనులు ఎందుకు నెమ్మదించాయని అధికారులకు వివరణ కోరారు. గడువులోపు పూర్తికాకుంటే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అడవి మామిడిపల్లి ఆర్వోబీ, అప్రోచ్ రోడ్ల నిర్మాణాలను అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తిచేయాలన్నారు. అలాగే, మామిడిపల్లి, బోధన్, ఆర్మూర్ ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలన్నారు. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు ఎంపిక చేసి ఇవ్వాలని కోరగా ఎంపిక పూర్తిచేసి లబ్ధిదారులకు ఇస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 42వేల దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయి పరిశీలించి 30 వేల మందిని అర్హులుగా గుర్తించామని కలెక్టర్ తెలిపారు. గృహలక్ష్మి ప్రక్రియ నిరంతర ప్రక్రియ అన్నారు. వెచ్చించిన నిధుల వివరాలను తెలుపుతూ సమగ్ర నివేదికలు తనకు సమర్పించాలని ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, వ్యవసాయ, డీఆర్డీఏ తదితర శాఖల అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మధ్యాన్న భోజనంలో గుడ్లు ఇవ్వట్లేదని సభ్యులు సమావేశంలో ఫిర్యాదు చేయగా, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. కేంద్ర నిధుల వివరాలను శిలాఫలకంపై స్పష్టంగా రాయించాలని సభ్యులు కోరగా ఎంపీ అధికారులకు ఆదేశించారు. 2016 నుంచి ఇప్పటివరకు జిల్లాలో ముద్ర లోన్స్ కింద 1,58,694 మందికి రూ. 2,264.88 కోట్లు రుణాలు ఇచ్చామని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ తెలిపారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మకరందు, డీఎఫ్‌వో వికాస్ మీనా, డీఆర్‌డీఓ చందర్, వివిధ శాఖల అధికారులు, దిశ కమిటీ సభ్యులు సోమ రాజారెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, కిషన్ నాయక్ ఉన్నారు.

అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయి

జీఎల నుంచి అన్ని వ్యవస్థలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. జీపీ తీర్మానాలను విస్మరించి, మండల పరిషత్ తీర్మానాలను పరిగణనలోకి తీసుకోవడం సమంజసం కాదన్నారు. 'గృహలక్ష్మి' ఎంపికలో రాజకీయ జోక్యం ఎక్కువైందని, ఈ పథకానికి ఒక్కరూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. 2018లో సీఎం కేసీఆర్ హామీనిచ్చారని, నాలుగున్నరేళ్లకు పథకం గుర్తొంచిందని, ఇది కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఏప్రిల్‌లో రూ.10వేల చొప్పున పరిహారం ఇస్తామని జీవో వచ్చినా.. ఇప్పటివరకూ రూ.9కోట్లు విడుదల కాలేదన్నారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు గుడ్లు ఇవ్వకున్నా ఇస్తున్నామని అధికారులు అబద్ధాలు చెబుతున్నారన్నారు. ప్రభుత్వ పనితీరు కేవలం పేపర్‌కే పరిమితమైందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులిస్తున్నా పనుల్లో జాప్యం జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వ పనులు మాత్రం నిధులు కేటాయించకున్నా పనులైపోతున్నాయని ఇదేం వింత ధోరణో తెలియట్లేదన్నారు.

మెగా జాబ్‌మేళా సక్సెస్



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

- మేళాలో పాల్గొన్న 41 కంపెనీలు
- 10 వేల మందికి పైగా తరలివచ్చిన అభ్యర్థులు
- 3,500 మందికి పైగా ఆఫర్ లెటర్లు

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో టాస్క్ ఆధ్వర్యంలో నగర శివారులోని భూమారెడ్డి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. సుమారు 10వేల మందికి పైగా యువతీయువకులు రిజిస్టర్ చేసుకోగా, 3,500మందికి ఆఫర్ లెటర్లు అందజేశారు. 41 ప్రైవేట్, మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు సాయంత్రం వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, నర్సింగ్‌తో పాటు వివిధ విభాగాల్లో విద్యార్హత కలిగి ఉన్న యువత జాబ్‌మేళాకు హాజరయ్యారు. వేర్వేరు కంపెనీల్లో 3,500 మందికి నియామకపత్రాలు అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి తదుపరి విద్యాభ్యాసం కొనసాగించే అవకాశం కూడా కంపెనీలు కల్పించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ కవిత, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా హాజరయ్యారు. రాబోయే రోజుల్లో ప్రతినెలా జాబ్‌మేళాలు నిర్వహిస్తామని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన 41 కంపెనీలు పాల్గొన్నాయని, జాబ్‌మేళాలో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతీయువకులు జాబ్‌మేళాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సూచించారు. అందివచ్చిన ఉద్యోగ అవకాశాలతో జీవితాలను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. నూటికి డెబ్బయ్ శాతం ప్రైవేట్ రంగాల్లోనే స్థిరపడ్డారన్నారు. జాబ్‌మేళాలు నిరంతర ప్రక్రియ అని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా పేర్కొన్నారు. ఐటీ హబ్‌లో ఉద్యోగాల కోసం గతంలో నిర్వహించిన జాబ్‌మేళాలలో 280 మందికి నియామకపత్రాలు అందజేశామన్నారు. మేయర్ దండు నీతూకిరణ్, నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, టాస్క్ మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి రఘుతేజ, కోర్వ దేవేందర్, చింత మహేష్, తిరుమల్, నవనీత్‌రెడ్డి తదితరులున్నారు.

ఎక్కడి ఫైళ్లు అక్కడే..

డిపార్ట్‌మెంట్	పెండింగ్ ఫైళ్లు
టౌన్‌ప్లానింగ్	200కు పైగా..
రెవెన్యూ	140కు పైగా..
ఇంజినీరింగ్	100కు పైగా..

- మున్సిపల్ కార్పొరేషన్‌లో పేరుకుపోతున్న దస్త్రాలు
- టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ సెక్షన్‌లలో..
- 45 రోజులు దాటినా క్లియరెన్స్ ఇవ్వని అధికారులు
- లబ్ధిదారుల ఎదురుచూపులు



నిజామాబాద్‌నాగారం : మున్సిపల్ కార్పొరేషన్‌కు రెండేళ్ల తర్వాత పూర్తిస్థాయి కమిషనర్‌గా మంద మకరందు బాధ్యతలు చేపట్టారు. వచ్చీరాగానే ఆయన వివిధ శాఖల్లో పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. మున్సిపాలిటీకి గుండెకాయలాంటి శానిటేషన్ వ్యవస్థను గాడిన పెట్టేందుకు తెల్లవారుజామునే ఫీల్డ్ విజిట్ చేశారు. ఉద్యోగుల్లో మార్పును తీసుకొచ్చేందుకు కృషి చేస్తూ వచ్చారు. అలాగే ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యతనిచ్చారు. అయితే కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 45 రోజులుగా వివిధ పనులకు సంబంధించి వివిధ శాఖల్లో ఫైళ్లు పెండింగ్ దశలోనే ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, శానిటేషన్‌లకు సంబంధించి కీలక ఫైల్లు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఫైళ్లకు సంబంధించి ఉద్యోగులు, లబ్ధిదారులు క్లియరెన్స్ కోసం ఎదురుచూస్తున్నారు.

ఆయా శాఖల్లో..

మున్సిపాలిటీలోని టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, శానిటేషన్‌లకు సంబంధించిన ఫైళ్లు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్‌లో ఇళ్ల అనుమతుల విషయంలో టీఎస్ బీపాస్ చట్టం ప్రకారం ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుడికి 21 రోజుల్లో అనుమతి రావాలి. లబ్ధిదారుల ఫైళ్లు సక్రమంగా లేకుంటే రిజెక్ట్ చేయాలి. 45 రోజులు దాటినప్పటికీ అలాంటి ఫైళ్లకు అనుమతి ఇవ్వలేదు. పైగా కొన్ని ఫైళ్లు గడువు ముగిసిన తర్వాత రిజెక్ట్ అయ్యాయి. నిబంధనల ప్రకారం 21 రోజులు దాటితే అనుమతి వచ్చినా, రాకున్నా అనుమతి ఇవ్వాల్సిందే. ఇంటి నిర్మాణం విషయంలో అధికారులు లబ్ధిదారుడిని ఇబ్బందులకు గురి చేయవద్దు. టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో సుమారుగా 260వరకు ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఎక్కడిక్కడ ఫైళ్లు పెండింగ్‌లో ఉండడంతో లబ్ధిదారులు కూడా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, తదితర సెక్షన్ల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు.

క్లియర్ చేస్తా..

ఓటర్ల జాబితా విషయంలో పక్కాగా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాను. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటరు జాబితా రూపొందిస్తున్నాం. టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇతర సెక్షన్‌లల్లో ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూస్తాను. ప్రతి ఫైళ్లు క్షుణ్ణంగా పరిశీలన చేసి క్లియర్ చేయడానికి చర్యలు తీసుకుంటాను.

– మంద మకరందు, మున్సిపల్ కమిషనర్

- రెవెన్యూకు సంబంధించి మ్యూటేషన్, ఇళ్ల ట్యాక్సీలకు సంబంధించిన ఫైళ్లు సుమారుగా 140 వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.
- ఇంజినీరింగ్ సెక్షన్‌కు సంబంధించిన ఎంబీ, ఇతర ఫైళ్లు సుమారు 100వరకు పెండింగ్‌లో ఉన్నాయి.
- శానిటేషన్‌కు సంబంధించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు ప్రతినెలా 20లోపు క్లియర్ చేయాలి. 28వ తేదీ దాటిన ఇంకా సంతకాలు కాలేదు. సుమారు 1000 మంది కార్మికులకు జీతాలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

ఓటర్ల జాబితాలో బిజీబిజీగా..

మున్సిపల్ కమిషనర్‌గా విధుల్లో చేరిన మంద మకరందు రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలో తలమునకలై ఉన్నారు. శానిటేషన్ విషయంలో ప్రత్యేకంగా తనిఖీలు చేస్తూనే ఉన్నారు. అలాగే ఇతర శాఖలనూ మానిటరింగ్ చేస్తున్నారు. ఉదయం, పగలు, రాత్రి అని తేడా లేకుండా ఓటర్ల జాబితాను పక్కాగా తయారు చేసేందుకు నిరంతరం సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేస్తున్నారు.

'బండ' భారం తగ్గింది

- వంటగ్యాస్‌పై రూ. 200 తగ్గించిన కేంద్రం
- ఉజ్వల యోజన వినియోగదారులకు రూ. 400 తగ్గింపు
- జిల్లా ప్రజలపై రూ. 13.70 కోట్లు తగ్గనున్న భారం

సుభాష్‌నగర్ : జిల్లాలోని గృహ గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కేంద్రం తీపి కబురు చెప్పింది. సిలిండర్‌పై రూ. 200, అలాగే ఉజ్వల యోజన పథకం వినియోగదారులకు రూ. 400 తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లా ప్రజలపై రూ. 13.70 కోట్ల వరకు భారం తగ్గనుంది. జిల్లాలో 6,33,642 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో సీఎస్‌ఆర్ కింద 21,011, దీపం పథకం విని యోగదారులు 70,641, ఉజ్వల యోజన 51,109, డబుల్ సిలిండర్లు 2,06,374, సింగిల్ కనెక్షన్లు 2,84,508 వినియోగదారులున్నారు. జిల్లావ్యాప్తంగా 32 గ్యాస్ కంపెనీల ఏజెన్సీలు ఉన్నాయి. ప్రస్తుతం సిలిండర్ ధర రూ. 1178.50 ఉంది. కేంద్రం సాధారణ సిలిండర్‌పై రూ.200 తగ్గించింది. 5,82,529 కనెక్షన్లకు గాను రూ. 200 చొప్పున రూ.11.65 కోట్ల భారం తగ్గనుంది. అలాగే ఉజ్వల యోజన వినియోగదారులకు రూ. 400 వరకు తగ్గించాలని నిర్ణయం తీసుకోగా, జిల్లాలో 51,109 కనెక్షన్లు ఉన్నాయి. దీనిపై రూ. 2.04 కోట్ల భారం తగ్గనుంది. తగ్గిన ధరలు నేటి నుంచి అమల్లోకి వస్తోంది.

ఇందూరులో రాఖీ సందడి



జిల్లాకేంద్రంలోని మార్కెట్లో వివిధ డిజైన్లతో కూడిన రంగురంగుల రాఖీలు సందడి చేస్తున్నాయి. రాఖీల క్రయవిక్రయాలతో నగరంలోని కుమార్‌గల్లీ, శివాజీనగర్, పెద్దబజార్, వినాయక్‌నగర్, కంఠేశ్వర్ తదితర ప్రాంతాలు రద్దీగా మారాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఓనం వేడుక



డిచ్‌పల్లిలోని తిరుమల నర్సింగ్ కళాశాలలో మంగళవారం ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 22 ఏళ్లుగా ఓనం వేడుకలను కళాశాలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– డిచ్‌పల్లి

క్లుప్తంగా

ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందిన జాన్కంపేట్ వాసి



వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ గ్రామానికి చెందిన సొడ నవీన్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ వీసీ రవీందర్ ఉద్యోగోన్నతి ఉత్తర్వును నవీన్‌కు మంగళవారం అందజేశారు. నవీన్ ఉద్యోగోన్నతి పొందడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాల పరిశీలన



నవీపేట: మండలంలోని మూడు రైల్వే గేట్ల సమీపంలో రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణాలకు అధికారులు మంగళవారం ప్రాంతాలను పరిశీలించారు. రైల్వే శాఖ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవిప్రకాశ్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, రోడ్డు భవనాల శాఖ ఈఈ సురేశ్ రైల్వే బ్రిడ్జి ప్రాంతాలను పరిశీలన చేపట్టారు. మండలంలోని మహంతం, ధర్యాపూర్, ధర్మారం ప్రాంతాల్లోని రైల్వేగేట్లను పరిశీలించారు. రైళ్ల రాకపోకలు, వాహనాల రద్దీ పెరగడంతో అధికారులు ఈ నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరించారు. వీరి వెంట డీఈఈ రామ్మోహన్, గిర్దావర్ మోహన్, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన ఆర్మీ జవాన్ అంత్యక్రియలు



ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో ఆర్మీ జవాన్ ప్రశాంత్ అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. బ్రెయిన్ ట్యూమర్‌తో కోల్‌కతా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. ప్రశాంత్ మృతదేహానికి ఆర్మీ సిబ్బంది సైనిక వందనం చేసి అంత్యక్రియలు చేపట్టారు. అంత్యక్రియల్లో ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ కార్యక్రమం పరిశీలన



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకుడు జగన్నాథ్‌రెడ్డి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవల గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. 122మంది మహిళలకు ఆరోగ్య, 14 మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, వైద్యులు స్రవంతి, మానస, ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ చరణ్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, సిబ్బంది ఉన్నారు.

మంత్రి ఆదేశాలు బేఖాతర్..

- స్కీం సభ్యులకు బహుమతులు, డబ్బులు వాపసు ఇవ్వని నిర్వాహకులు
- దొన్కల్‌లోనే 100కు పైగా బాధితులు
- గతంలో పక్షం రోజుల గడువు ఇచ్చిన మంత్రి



స్కీంకు సంబంధించిన బ్రోచర్

మోర్తాడ్(బాల్కొండ): స్కీంల స్కాంకు సంబంధించి సభ్యులైన వారికి బహుమతులు లేదా సొమ్ము వాపసు ఇవ్వాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశించినా నిర్వాహకులు పెడచెవిన పెట్టడంతో స్కీం సభ్యులు ఆందోళన చెందుతున్నారు. 2020లో మొదలైన స్కీం 2021లో ముగిసిపోయింది. డ్రాలో పెద్ద బహుమతులు పొందిన సభ్యులకు లబ్ధి జరుగగా చివరి వరకు ఎలాంటి బహుమతి గెలుచుకోని వారికి స్కీం నిర్వాహకులు ముందుగా ప్రకటించిన ప్రకారం ఏదో ఒక బహుమతి ఇవ్వాల్సి ఉంది. 15 నెలల స్కీంకు చివరి వరకు ఉన్న సభ్యుడు నెలకు రూ.1,500ల చొప్పున మొత్తం రూ.22,500లు చెల్లించాడు. ఇలా చివరి వరకు ఉన్న సభ్యులకు ప్లాస్మా టీవీ లేదా రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్లలో ఏదో ఒకటి ఇస్తామని నిర్వాహకులు ప్రకటించారు. ప్రతి వస్తువు ధర రూ.10వేల లోపు ఉంది. అంటే చివరి వరకు ఉన్న సభ్యుడు ఎక్కువ మొత్తంలోనే నష్టపోతున్నాడు. స్కీం ముగిసి రెండేండ్లు గడిచినా సభ్యులకు బహుమతులు ఇవ్వకపోవడం, డబ్బు వాపసు చేయకపోవడంతో నిర్వాహకుల బండారం బయటపడింది. దొన్కల్ కేంద్రంగా సాగిన స్కీంలో ఈ గ్రామానికి చెందినవారే ఎక్కువ మంది బాధితులు ఉన్నారు. ఇప్పటికీ కొంత మందికి స్కీం సొమ్ము, బహుమతులు ఇవ్వగా ఇంకా 100 మందికి మించి బహుమతులను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ నిర్వాహకులు మాత్రం మంత్రి ఇచ్చిన గడువు ముగిసిపోయినా ఇంకా బహుమతులు, సొమ్ము వాపసు ఇవ్వడం లేదు. స్కీంల స్కాంతో అధికార పార్టీకి అంటిన మరకను తుడిచివేయడానికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి మోర్తాడ్ జడ్పీటీసీ సభ్యుడు బద్దం రవికి బాధ్యతలు అప్పగించారు. జడ్పీటీసీ సభ్యుడు నిర్వాహకులతో మాట్లాడి బాధితుల బహుమతులు, స్కీం డబ్బుల వాపసు ఇప్పించాల్సి ఉంది. తమ గ్రామంలో తాము బహుమతులు ఇచ్చుకుంటామని జడ్పీటీసీ సభ్యుడిని నమ్మించి తప్పుదోవ పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందరికీ డబ్బులు లేదా బహుమతులు ఇచ్చేశామని నమ్మించిన నిర్వాహకులు తమ బాధ్యత తీరిపోయిందనే ధీమాతో ఉన్నారు. కానీ స్కీంల బాధితులు మాత్రం ఒక్కొక్కరు బహిరంగం అవుతున్నారు. మంత్రి చెప్పినా మాటను స్కీం నిర్వాహకులు లెక్క చేయకపోవడంపై ఆగ్రహంతో ఉన్న సభ్యులు పోలీసులను ఆశ్రయించాలని చూస్తున్నారు. ఏది ఏమైనా స్కీంల స్కాంతో అధికార పార్టీకి మాయని మచ్చ ఏర్పడిందని చెప్పొచ్చు.

అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

- 52 తర్పల భవన నిర్మాణాలకు రూ. కోటి ప్రకటించిన ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్‌నాగారం: అన్నివర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. నగరంలోని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే బిగాలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. చేనేతపై బ్రిటిష్ వారు కూడా పన్ను విధించలేదని కానీ కేంద్ర ప్రభుత్వం పన్నులు విధిస్తోందని అన్నారు. నగరంలోని 52 తర్ప సంఘాలకు ఇప్పటికే ఇచ్చిన నిధులు కాకుండా మరిన్ని కేటాయించాలన్న ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు తన ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ. కోటి నిధులు ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండి పథకాలు అందేలా కుల సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత పదేళ్ల కాలంలో ఎలాంటి గొడవలు లేకుండా శాంతి భద్రతలను సమర్థవంతంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వాలు చేనేత పరిశ్రమను కుదేలు చేశాయని విమర్శించారు. బీడీ కార్మికులకే కాకుండా టేకేదారులకు కూడా పింఛన్ అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని తేల్చి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే గణేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నగరంలోని 51 పద్మశాలీ సంఘాలకు రెండుసార్లు రూ. 5 కోట్ల సీడీపీ నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా తెలిపారు. రూ. 25 లక్షలతో మార్కండేయ ఆలయన పునఃనిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, నాయకులు యాదగిరి, గుజ్జేటి వెంకట నర్సయ్య, యెనుగందుల మురళీ, బిల్ల మహేశ్, సిరిగాధ ధర్మపురి, సత్యపాల్, కస్తూరి గంగరాజు, శివలింగం, శంకర్, కార్పొరేటర్ ఆకుల హేమలత, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తాం



ధ్యాన్‌చంద్ చిత్ర పటంవద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ పోచారం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ మినీస్టేడియంలో క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఖోఖో పోటీలు నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూలమాల వేసిన స్పీకర్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. దేశ ప్రతిష్టతను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ధ్యాన్‌చంద్‌కు తనశ్రద్ధాంజలి అని, విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆటలు కూడా అంతే అని అన్నారు. బాన్సువాడలో అన్ని వస తులతో క్రీడాకారుల సౌలభ్యానికి మినీ స్టేడియాన్ని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, రైతుబంధు సమితి మండల కో-ఆర్డినేటర్ అంజిరెడ్డి, నాయకులు ఎజాస్, కృష్ణారెడ్డి, పాతబాలకృష్ణ, మోహన్‌నాయక్, జుబేర్, మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, నిర్వాహకుడు నరేశ్, పీఈటీలు దాసరి అనిల్, సురేందర్, రవి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణదారునితో సర్పంచ్ వాగ్వాదం



బీబీపేట: మండల కేంద్రంలోని కనకదుర్గ వైన్స్‌లో తనకు కావాల్సిన మద్యం లేదని చెప్పిన వైన్స్ యజమానిపై ఉప్పరపల్లి సర్పంచ్ ప్రసాద్ మంగళవారం వాగ్వాదపడ్డాడు. దుకాణ సిబ్బంది ఎంత సముదాయించినా వినిపించుకోకుండా వైన్స్ షెట్టర్‌ను బలవంతంగా మూసేశాడు. సర్ది చెప్పడానికి ప్రయత్నించిన సిబ్బందిపై దూషించా డు. సర్పంచ్ తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి



విజేతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న రిజిస్ట్రార్

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అన్నారు. టీయూ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సవం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. క్రీడా మాంత్రికుడు ధ్యాన్ చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మహేందర్, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతకాలి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి: దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతికేలా సీఎం కేసీఆర్ మార్గదర్శకం చేశారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగులకు పెన్షన్ల పెంపు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వికలాంగులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి దివ్యాంగులకు పెరిగిన పెన్షన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు మాధవి, దశరథ్‌రెడ్డి, జడ్పీటీసీలు ఉషాగౌడ్, మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట ఎంపీడీవోలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇబ్బందికరంగా ప్రవర్తించిన పలువురు ఆశావర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని వదిలిపెట్టారు.

టీయూ బీసీ బోధనేతర సిబ్బందికి రాష్ట్ర సంఘంలో చోటు



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘంలో టీయూ బోధనేతర సిబ్బందికి చోటు లభించింది. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సంఘం ఎన్నికల్లో రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులుగా టీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, ఏఈ వినోద్, సూపరిండెంట్ బి.భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాయాగౌడ్, వినోద్, భాస్కర్‌కు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ, అధ్యాపకులు నాగరాజు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

కేంద్ర నిధులతోనే అభివృద్ధి పనులు

- కవిత పోటీ చేస్తే ఈసారి మూడోస్థానమే..
- ఎంపీ ధర్మపురి అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: మంత్రి ప్రశాంత్‌రెడ్డి బాల్కొండ నియోజకవర్గంలో చేపడుతున్న బ్రిడ్జిలు, చెక్‌డ్యామ్‌లు, రోడ్లు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేపడుతున్నాడని, ఆయన తింటున్న తిండి, గుడ్డ, సంపాదించిన రూ. వందల కోట్లు అన్నీ కేంద్రానివేనని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. దిశా సమావేశం ముగిసిన తర్వాత కలెక్టరేట్ ఆవరణలో ఆయన మీడియాతో మంగళవారం మాట్లాడారు. జిల్లాలో ఎమ్మెల్సీ కవిత, మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేస్తున్న దౌర్జన్యాలు, గంజాయి దందాలు ప్రజలందరికీ తెలుసని, ఇవన్నీ చూసే ఎంపీగా కవితను ఓడించారని గుర్తు చేశారు. మంత్రికి కవితపై అంత భరోసా ఉంటే.. మరోసారి ఎన్నికల్లో పోటీ చేయించాలని, ఈసారి మూడోస్థానం పక్కా అని పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోనే అత్యధికంగా పసుపు పంట పండుతుందని, ఏ ఒక్క రైతుకైనా సాయం చేశావా అని మంత్రిని ప్రశ్నించారు. ధర తగ్గినప్పుడు ఎంఐఎస్ కింద కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలని కోరితే పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటివరకు 20వేల టార్పాలిన్లు, 500 వరకు పాలిషర్లు, నాబార్డు ద్వారా కోల్డ్ స్టోరేజీలకు రుణాలు అందిస్తున్నామని, పసుపు ధర పెంచేందుకు ఎగుమతులు పెంచి, దిగుమతులు తగ్గించామని తెలిపారు. ఆయన వెంట దిశా కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు గ్రామంలో మంగళవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

దోమకొండలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు

దోమకొండ: మండల కేంద్రంలోని ముత్యంపేట రోడ్డులో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలను మంగళవారం చేపట్టారు. వాహనదారులకు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి తెలిపారు. కానిస్టేబుళ్లు సంజీవ్, సాయిలు, సామ్రాట్, వెంకటేశ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఇద్దరు నిందితుల రిమాండ్



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

డిచ్‌పల్లి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముల్లంగి(ఐ) గ్రామానికి చెందిన బొల్లారం నవీన్ బర్దీపూర్ శివారులోని మహీంద్ర షోరూంలో పని చేస్తున్నాడు. జూలై 4న ఎప్పటిలాగే షోరూం ఎదుట బైక్‌ను పార్క్ చేశాడు. కొద్దిసేపటికి వచ్చి చూడగా బైక్ కన్పించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డిచ్‌పల్లి సీఐ కె.కృష్ణ, ఎస్సై యు.మహేశ్‌లు టెక్నాలజీ సాయంతో చాకచక్యంగా దర్యాప్తు చేపట్టి కేసును చేధించారు. డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ ఎదుట మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నిజామాబాద్ నుంచి డిచ్‌పల్లి వైపు అనుమానస్పదంగా నంబర్ ప్లేట్ లేని బైక్‌పై ఇద్దరు వెళ్తుండగా వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. రెంజల్ మండలం కందకుర్తికి చెందిన అలీం బేగ్, మీర్జా మునావర్ బేగ్, నగరానికి చెందిన హాకీఫ్ కలిసి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు మద్యం దుకాణాల ఎదుట నిలిపి ఉంచిన బైక్‌లకు నకిలీ తాళం వేసి దొంగిలిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే చోరీ చేసిన బైక్‌ను గుర్తు పట్టకుండా నంబర్ ప్లేట్ తొలగించి, బండి ఇంజిన్, చాసిస్ నంబర్లను బండరాయితో పూర్తిగా తొలగిస్తామని నిందితులు అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 17 బైక్‌లను స్వాధీనం చేసుకుని కోర్టులో రిమాండ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. మరో నిందితుడు హాకీఫ్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే అతడిని పట్టుకుంటామని అన్నారు. కేసును చేధించిన సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్, కానిస్టేబుళ్లు రాజేశ్వర్, సర్దార్, లింగం, సుధాకర్, రాము, సతీశ్, సందీప్, శ్రీనివాస్‌లను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి స్వాధీనం చేసుకున్న ఎస్సై అశోక్

ఖలీల్‌వాడి: నిర్మల్ నుంచి తీసుకొచ్చిన గంజాయిని విక్రయించడానికి ప్యాకెట్లు చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు. నగరంలోని బర్కత్‌పురకాలనీకి చెందిన షేక్ అఫ్రోజ్, దారుగల్లీకి చెందిన సయ్యద్‌జరీనా గంజాయి విక్రయించేందుకు ప్యాకెట్లను తయారు చేస్తున్నట్లు తెలిపారు. షేక్ అఫ్రోజ్ నిర్మల్ నుంచి నిషేధిత ఆరు కిలోల గంజాయిని తీసుకొచ్చి సయ్యద్ జరీనా ఇంట్లో దాచిపెట్టాడు. ఇరువురు గంజాయిని ప్లాస్టిక్ కవర్లలో నింపి విక్రయించేందుకు ప్యాక్ చేస్తుండగా పక్కా సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. సౌత్ తహసీల్దార్ బాలరాజు సమక్షంలో పంచనామా నిర్వహించినట్లు చెప్పారు. గంజాయి విలువ రూ.13,750 ఉంటుందని పేర్కొన్నారు. ఈ కేసును చేధించిన నగర సీఐ నరహరి, ఎస్సై అశోక్‌ను ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కిరణ్‌కుమార్ అభినందించారు.

రేపు రాఖీ పౌర్ణమి

నిజామాబాద్ సిటీ: ప్రజలు రాఖీ పౌర్ణమిని గురువారం నిర్వహించుకోవాలని ప్రముఖ వేద పండితుడు, అంతర్జాతీయ స్వర్ణ కంకణ రుగ్వేద సలక్షణ గణపాటి బ్రహ్మశ్రీ జోషి మధుసూదన్ శర్మ తెలిపారు. ఈ సంవత్సరం రాఖీ పండుగను ఎప్పుడు జరుపుకోవాలో ప్రజలకు తెలియడం లేదని పౌర్ణమి తిథి ఏ రోజు ఉంటే అదే రోజు రాఖీ పౌర్ణమి అని పేర్కొన్నారు. రాఖీ బంధన సమయాలు ఉదయం 6.30 నుంచి 9.45 గంటల వరకు, 10.50 నుంచి 11.50 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2.40 గంటల వరకు, మధ్యాహ్నం 3.45 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ముహూర్తం ఉందని పై సమయాల్లో మాత్రమే రాఖీ బంధన చేపట్టాలని తెలిపారు.

క్రైం కార్నర్

మూడు రోజుల వ్యవధిలో తల్లీకొడుకుల మృతి



ద్యావరి రాజవ్వ (ఫైల్)



ద్యావరి సిద్ధిరాములు (ఫైల్)

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో విషాదం చోటుచేసుకుంది. మూడు రోజుల వ్యవధిలో తల్లీ, కుమారుడు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ద్యావరి సిద్ధిరాములు (58) వ్యవసాయం చేసేవాడు. అతడు అనారోగ్యానికి గురికావడంతో 15 రోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. అతని తల్లి ద్యావరి రాజవ్వ (85) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధువులు ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిద్ధిరాములు పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మూడు రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో తల్లీకొడుకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

రామారెడ్డి: రామారెడ్డి మండలం జగదంబ తండాలో గంగావత్‌రాజు నాయక్ చెందిన ఆవు మంగళవారం మృతి చెందింది. తమ పంట పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని బాధిత రైతు పేర్కొన్నాడు. ఆవు విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

మద్యం సేవించి బైక్ నడిపినందుకు..

ఖలీల్‌వాడి: మద్యం సేవించి బైక్ నడిపిన గోకుల్‌రాజ్‌కు నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ రెండు రోజుల జైలుశిక్షను విధించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన గోకుల్ రాజ్ జిల్లా కేంద్రంలో వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నాడు. నగరంలోని కుమార్‌గల్లీలో పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు గోకుల్‌రాజ్ మద్యం సేవించినట్లు రుజువైంది.

తండ్రిని చంపిన తనయుడికి ఏడేళ్ల జైలు

ఖలీల్‌వాడి: కన్నతండ్రిని చంపిన తనయుడికి ఏడేండ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తున్నట్లు నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. డిచపల్లి మండల కేంద్రానికి చెందిన వాహెద్‌ఖాన్‌కు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. అందరికీ వివాహాలు చేసిన వాహెద్‌ఖాన్ డిచ్‌పల్లిలోని ఓ మడిగెలో చికెన్‌సెంటర్, పంక్చర్ షాప్ నిర్వహిస్తున్నాడు. పెద్ద కుమారుడు అఫ్సర్‌ఖాన్ మద్యానికి బానిసై నిత్యం తండ్రిని డబ్బులు కావాలని వేధించేవాడు. అఫ్సర్‌ఖాన్ పెడుతున్న బాధలను తట్టుకోలేక అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. 2020మే26న తన తండ్రితో మద్యం డబ్బులు కావాలని అడిగాడు. తనవద్ద డబ్బులు లేవని చెప్పిన తండ్రితో గొడవపడ్డాడు. కమ్మకత్తితో తండ్రిని చంపబోయాడు. షాప్‌లో ఉన్న పంపును అడ్డుగా పెట్టుకున్నా తండ్రి చేతులు, మెడ, తల, గొంతుపై అఫ్సర్ తీవ్రంగా గాయపర్చాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేసిన నేరాలు రుజువు కావడంతో జడ్జి నిందితుడినిక ఏడేండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. రెండు వేల జరిమానా విధించింది.

పలువురిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కు లాస్‌పూర్ తండాలో ఆరుగురు, మోపాల్‌లో ఐదుగురిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాము మంగళవారం తెలిపారు. కులాస్‌పూర్ అటవీప్రాంతంలో చెట్లను నరికేసినట్లు గుర్తించిన ఎఫ్ఆర్‌వో రామేశ్వర్‌రెడ్డి తండాకు చెందిన ఆరుగురిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మోపాల్ మండల శివారు లో ఏడీ సర్వే చూయించిన భూమిలో హద్దులు ఏ ర్పాటు చేసుకుంటున్న భూమయ్యను బెదిరించిన ఐదుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. హద్దులు తొలగించడమే కాకుండా బెదిరింపులకు గురిచేశారని భూమయ్య ఫిర్యాదు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఇద్దరిపై కేసు

వర్ని: మండలంలోని రూపులా నాయక్ తండా, సక్రియ నాయక్ తండాల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ గన్ను మంగళవారం తెలిపారు. స్పెషల్ పార్టీ అధికారులు తండాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించి అక్రమంగా విద్యుత్‌ను వాడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.